క్లుప్తంగా

అయ్యలూరివారిపల్లె లడ్డు, కలశం రూ.20.10 లక్షలు



సుబ్బారెడ్డికి కలశం, లడ్డు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కమిటీ

సీఎస్‌పురం (పామూరు): వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా సీఎస్‌పురం మండలం అయ్యలూరివారిపల్లెలో సోమవారం గణపతి మండపం వద్ద నిర్వహించిన వేలంలో కలశం రూ.10 లక్షలు, లడ్డు రూ.10.10 లక్షలు పలికింది. వేలంలో లడ్డు, కలశంను గ్రామానికి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ముత్యాల వెంకట సుబ్బారెడ్డి రూ.20.10 లక్షలు వెచ్చించి దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బారెడ్డిని ఘనంగా సన్మానించి సర్పంచ్ ముత్యాల భారతీ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజనా వెంకటరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, నాయకులు కలశం, లడ్డులను వేలం విజేతకు అందజేశారు. అదేవిధంగా మండలంలోని శీలంవారిపల్లె కదిరి బాబూరావు వ్యవసాయ, ఉద్యానవన కళాశాలల్లో ఏర్పాటు చేసి వినాయక విగ్రహమూర్తులకు ఘనంగా నిమజ్జనం చేశారు.

ఎస్సైని కలిసిన సర్పంచ్‌లు



ఎస్సైని సన్మానిస్తున్న సర్పంచులు

వెలిగండ్ల: బదిలీల్లో భాగంగా వెలిగండ్లకు ఎస్సైగా వచ్చిన అహరోన్‌ను సర్పంచులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచులు టి.సురేష్ బాబు, గోనా జేమ్స్, చిలకల నారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు టి.నాని, అయినకోట రంగయ్య, వెంకటేశ్వరరెడ్డి, పొట్లేళ్ల మాల్యాద్రి, రవీంద్ర తదితరులు ఎస్సైని సన్మానించారు.







పాకల తీరంలో గణనాథుని విగ్రహాల నిమజ్జనం

వెళ్లి రావయ్యా వినాయకా..!



పాకల తీరంలో నిమజ్జనానికి బారులు తీరిన వినాయక విగ్రహాలు



కూటాగుండ్లలో గణనాథున్ని నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు

- కనులపండువగా నిమజ్జనోత్సవం

సింగరాయకొండ: మూడు రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడు సోమవారం గంగ ఒడికి చేరాడు. మండలంతో పాటు జరుగుమల్లి, కొండపి, మర్రిపూడి, కందుకూరు మండలాల నుంచి 70 విగ్రహాలు సోమవారం పాకల బీచ్‌లో నిమజ్జనం చేశారు. పాకల బీచ్‌లో సీఐ సీహెచ్ హజరత్తయ్య పర్యవేక్షణలో మెరైన్ పోలీసులతో పాటు సింగరాయకొండ, జరుగుమల్లి ఎస్సైలు బి.మహేంద్ర, పున్నారావులు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. నిమజ్జనోత్సవంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పీసీపల్లి: మండలంలో గణనాథుల నిమజ్జనోత్సవం కనులపండువగా సాగింది. ఈ సందర్భంగా మండపాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం, లడ్డు వేలంపాట నిర్వహించారు. గోపవరపువారిపల్లిలో నిర్వహించిన వేలంలో గోపవరపు వెంకటేశ్వర్లు రూ.50 వేలకు పాడుకొని లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై జి.కోటయ్య బందోబస్తు ఏర్పాటు చేశారు.



పాకలో బందోబస్తు నిర్వహిస్తున్న సీఐ హజరత్తయ్య

మర్రిపూడి: మండలంలో గణనాథుని నిమజ్జనం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. మూడు రోజుల పాటు పూజలందుకున్న గణనాథున్ని కోలాహలంగా నిమజ్జనానికి తరలించారు. మేళతాళాలు, బాణసంచా కాలుస్తూ నిమజ్జనానికి తీసుకువెళ్లారు. మర్రిపూడి పడమటి బజారులో వైఎస్సార్ యూత్ ఫోర్సు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం లడ్డూ ప్రసాదం వేలంపాట నిర్వహించారు.

హనుమంతునిపాడు: మండలంలో గణనాథుల నిమజ్జనోత్సవం కనులపండువగా సాగింది. ఎంపీపీ గాయం సావిత్రి పెద్దగొల్లపల్లిలో జరిగిన నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. బొజ్జ గణపయ్యకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కూటాగుండ్ల, సీతారాపురం,హనుమంతునిపాడు, గొల్లపల్లి, వేములపాడు, నందనవనం, తిమ్మారెడ్డిపల్లి, వెంగపల్లి, ఆవులవారిపల్లి, చిన్న మల్లవరం గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లడ్డూ ప్రసాదం వేలంపాట నిర్వహించారు. అనంతరం మేళతాళాల నడుమ గణపయ్యను నిమజ్జనానికి తరలించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వినాయక విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం



పెద్దగొల్లపల్లిలో పూజల్లో ఎంపీపీ గాయం సావిత్రి



మర్రిపూడిలో వినాయక విగ్రహం ఊరేగింపు

విజయవాడ విలయం

చంద్రబాబు నిర్వాకమే

- చంద్రబాబు స్వార్థం కోసం వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా వరదనీటి మళ్లింపు
- సహాయక చర్యల్లో సర్కారు విఫలం
- 50 మంది మృత్యువాత చంద్రబాబు వైఫల్యమే..
- బాబు నిర్లక్ష్య వైఖరిపై దద్దాల ధ్వజం



దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: చంద్రబాబు స్వార్థం, నిర్లక్ష్యం.. ముందస్తు చర్యల్లో, ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ లోపం వల్లే విజయవాడ ప్రాంతం వరద నీటిలో మునిగి విలయవాడగా మారి 50 మంది మరణించి లక్షలాది మంది నిరాశ్రయులయ్యారని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ధ్వజమెత్తారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ వరద విపత్తు నష్టానికి ముమ్మాటికీ చంద్రబాబుదే బాధ్యత అని తీవ్రంగా మండిపడ్డారు. ప్రకృతి వైపరీత్యాలు, వరదల సమయంలో వాతావరణ శాఖ, నీటిపారుదల విభాగం ముందస్తు హెచ్చరికలను ప్రభుత్వానికి తెలియజేస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజలను అప్రమత్తం చేసి ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి పునరావాసం, కనీస వసతులు కల్పిస్తారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఈ విషయంలో ఘోరంగా విఫలమైందన్నారు. భారీ వర్షాలు వరదలు వస్తాయని ముందే తెలిసినా ప్రజలను అప్రమత్తం చేయలేదన్నారు. కేవలం చంద్రబాబునాయుడు ఇళ్లు మునిగిపోకుండా, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ యాక్టివ్ పవర్ ప్లాంట్ మునిగిపోకుండా కాపాడేందుకే బుడమేరు నుంచి నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడ మీదకు వదలడంతోనే ఇంత ఘోరమైన పరిస్థితి నెలకొందన్నారు. వరద ముంచెత్తిన తరువాత కూడా సహాయక చర్యల్లో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. లక్షలాది మంది తాగేందుకు నీరు కూడా లేక ఆకలితో అలమటించిపోయారన్నారు. ఎనిమిది రోజుల పాటు లక్షల మంది ప్రజలు నరకయాతన అనుభవించారని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు అధికారులను వెంట వేసుకుని తిరగటం తప్ప వారికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించి పర్యవేక్షించే ప్రయత్నం చేయలేదన్నారు. రోజుకు మూడు నాలుగు సార్లు ప్రెస్‌మీట్లు పెట్టి అంతా తానే చేస్తున్నట్టు భ్రమ కల్పించే ప్రయత్నం, ప్రచార ఆర్భాటం తప్ప వరద బాధితులను ఆదుకోలేదన్నారు. ముమ్మాటికీ వరద పాపం చంద్రబాబుదేనని తీవ్రంగా మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వ వైఫల్యాన్ని తీవ్రంగా ఎండగట్టారు.

నారాయణస్వామి ఆదాయం రూ.3.06 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.3,06,060 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.47,140, లడ్డుప్రసాదాల అమ్మకం ద్వారా రూ.23,350, ఆలయంవద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.2,07,954, మహాప్రాకార నిర్మాణానికి రూ.25,116, ఇతర విరాళాలు రూ.2,500 అందజేశారన్నారు. కంభంకు చెందిన ఓరుగంటి సత్యనారాయణ, సుబ్బమ్మ, రఘునారాయణ, అరుణ అన్నదానానికి రూ.1.50 లక్షల విరాళం ఇచ్చారు. కొమ్మినేని వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.



చైర్మన్‌కు విరాళం చెక్కు అందజేస్తున్న దాతలు

పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం



పౌష్టికాహార ఆవశ్యకతను వివరిస్తున్న సూపర్‌వైజర్ పద్మజ

పామూరు: పౌష్టికాహార తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులు మెరుగైన ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, ఎంపీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని అయ్యన్నకోట అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, పడమటి కట్టకిందపల్లెలో సూపర్‌వైజర్ పార్వతి ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతం ఇతర పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు ఉపయోగించుకోవాలన్నారు. పౌష్టికాహారం ముడిధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు తినాలని సూచించారు. అనంతరం పౌష్టికాహార ఆవశ్యకత ర్యాలీ నిర్వహించి పౌష్టికాహారం పంపిణీ చేశారు.



మాట్లాడుతున్న సీడీపీఓ సరోజిని

తల్లి పాలలో పోషకాలు అధికం

కనిగిరి రూరల్: తల్లి పాలలోనే అత్యధిక పోషక విలువలు ఉంటాయని సీడీపీఓ సరోజిని అన్నారు. మండలంలోని చాకిరాల పంచాయతీ తురకపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారా మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీఓ పి.సరోజిని మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, 0–5 ఏళ్ల లోపు వయసున్న పిల్లల్లో రక్తహీనతవల్ల వచ్చే అనారోగ్య సమస్యల నివారణకు పోషకవిలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు లభించే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు వల్ల అధిక పోషకాలు లభిస్తాయని తెలిపారు. సూపర్‌వైజర్ మల్లేశ్వరి, హెచ్‌ఎం శ్రీనివాసులరెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరునికి విశేష పూజలు



ప్రత్యేక పూజల్లో దద్దాల మంజు భార్గవి, వైస్ చైర్మన్ పులి శాంతి



విశిష్ట పూజల్లో పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, సరితారెడ్డి దంపతులు



పామూరులో పూజల్లో పాల్గొన్న సీఐ, నాయకులు

కనిగిరి రూరల్: వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని మూడవ రోజు గ్రామాల్లో గణేశునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల గణనాథుని నిమజ్జనోత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా జరిగిన విశిష్ట పూజల్లో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు. పట్టణంలోని బీసీ కాలనీ, 20వ వార్డు తదితర చోట్ల కొలువుదీరిన వినాయక విగ్రహాల వద్ద జరిగిన విశిష్ట పూజల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ సతీమణి దద్దాల మంజు భార్గవి, వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ పసుపులేటి దీపలు పాల్గొన్నారు. అనంతరం విగ్రహ కమిటీలు వారిని ఘనంగా సన్మానించారు. అలాగే ఎంఎస్‌ఎం కళాశాల వద్ద, గార్లపేట రోడ్డులోని గణపతి విగ్రహాల వద్ద పీడీసీసీబీ మాజీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ వైఎం సరితా ప్రసాద్‌రెడ్డిలు విశిష్ట పూజలు చేశారు. పోటీల్లోని విజేతలకు బహుమతులు అందచేశారు. సాయినగర్‌లోని విఘ్నేశ్వరునికి మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ ప్రత్యేక పూజలు చేసి వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులు అందచేశారు. పట్టణంతో పాటు, పలు గ్రామాల్లో గణేష్ నిమజ్జనోత్సవం పురస్కరించుకుని జరిగిన లడ్డు వేలం పాటలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిమజ్జనం సందర్భంగా ఊరేగింపులు కనులపండువగా సాగాయి.

పామూరు: మండలంలో వినాయకచవితి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. పామూరుతో పాటు మండలంలోని దూబగుంట్ల పలు గ్రామాల్లో వినాయక నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొని పూజలు చేశారు. పామూరులోని కందుకూరు రోడ్డులో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద సీఐ ఎం భీమానాయక్, రెడ్డి సంక్షేమ సంఘ నాయకులు, సీఎస్‌పురం సింగిల్ విండో మాజీ చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సిద్ధమూర్తి లక్ష్మీనారాయణ రెడ్డి, యాటా రాఘవేంద్ర పాల్గొన్నారు.



గణేశునికి ప్రత్యేక పూజలు

మహబూబ్‌బాషాకు అభినందనలు

కందుకూరు: ముస్లిం ఐక్య వేదిక నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ మహబూబ్‌బాషాకు ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ప్రకటనలో అభినందనలు తెలిపారు.

1213 బేళ్ల కొనుగోలు

కొండపి (సింగరాయకొండ): స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం జరిగిన వేలంలో 1213 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. కామేపల్లి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు 1344 బేళ్లను వేలానికి తీసుకురాగా 1213 బేళ్లను కొనుగోలు చేసి వివిధ కారణాలతో 131 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.190, సరాసరి రూ.291.03 నమోదైంది. వేలంలో 16 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో సోమవారం జరిగిన వేలంలో 59 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. కారుమంచి క్లస్టర్ గ్రామాలకు చెందిన రైతులు 797 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 738 బేళ్లను కొనుగోలు చేసి 59 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.195 పలకగా సరాసరి రూ.305.55గా నమోదైంది. వేలంలో 45 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తులు

టంగుటూరు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని వల్లూరు సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జరుగుమల్లి మండలం చింతలపాలెం గ్రామానికి చెందిన సవలం బ్రహ్మనాయుడు, వెంకట్రావు ఇద్దరూ ద్విచక్ర వాహనంపై చింతలపాలెం గ్రామం నుంచి ఒంగోలు వెళుతుండగా వల్లూరు సమీపంలో కారు ఆకస్మాత్తుగా ఆగి వెనక్కి వస్తూ ఇద్దరిని ఢీకొట్టింది. ప్రమాదంలో బ్రహ్మనాయుడు, వెంకట్రావులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నామని ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు.

వరద బాధితులకు చేయూత



నిత్యావసరాల పంపిణీలో స్నేహ హస్తం ట్రస్ట్ బృందం

కనిగిరి రూరల్: స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పలువురు దాతల సాయంతో విజయవాడలోని వరద బాధితులకు నిత్యావసర సరుకులు సోమవారం పంపిణీ చేశారు. విజయవాడలోని లంక, ముంపు ప్రాంతాలకు వెళ్లి నిత్యవసర సరుకులు, కూరగాయలు, రొట్టెలు, పండ్లు, దుప్పట్లు, దుస్తులు 400 కుటుంబాలకు అందజేసినట్లు ట్రస్టు అధ్యక్షుడు డి.సుధీర్‌బాబు తెలిపారు. వరద ముంపు ప్రాంతాల్లో జరిగిన సహాయక చర్యలు స్నేహహస్తం ట్రస్ట్ మిత్రబృదం, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ బీవీ సాగర్ ఉన్నారు. తొలుత కనిగిరిలో నిత్యవసర వస్తువుల పంపిణీ వాహనాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెంట్ డాక్టర్ అబ్దుల్ కలాం, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు ఎస్‌కే జంషీర్ అహ్మద్, శాలివాహన సంఘ రాష్ట్ర కార్యదర్శి కె.ఓబులేసు, దుర్గం మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదాంబేగ్ ప్రారంభించారు.

తీరం మురుగుమయం



హేచరీ నుంచి సముద్రంలోకి వస్తున్న మురికినీరు

- నిమజ్జన ప్రాంతంలోనే మురుగునీరు వదిలిన హేచరీ యాజమాన్యం



నల్లగా మారిన సముద్రం నీరు

ఉలవపాడు: మండల పరిధిలోని అలగాయపాలెం బీచ్‌కు సోమవారం మూడవ రోజు భారీగా భక్తులు నిమజ్జనానికి తరలివచ్చారు. బీచ్‌లో గత ఐదేళ్లుగా హేచరీల నుంచి మురుగు నీరు వదిలే పైపు ఉంది. ఇది బీచ్ ఆవరణలోనే నిమజ్జనానికి 10 మీటర్ల దూరంలోనే ఉంది. గతంలో నిమజ్జన సమయంలో మురుగునీటి విడుదల నిలుపుదల చేసేవారు. కానీ సోమవారం ఆ మురుగునీరు అలానే వదలడంతో సముద్రంలోని నీరంతా మురికిమయంగా మారింది. ఆ మురుగు నీటిలోనే భక్తులు సముద్రస్నానమాచరించి వినాయకుడిని నిమజ్జనం చేశారు. సాయంత్రం 5 గంటల సమయంలో దీన్ని గుర్తించిన భక్తులు వెంటనే మంజునాథ హేచరీ యజమానులకు ఫోన్ చేసి అడగడంతో వారు నీరు ఆపారు. కానీ అప్పటికే అంతా మురుగుమయమై సముద్రం నీరు అంతా నల్లగా మారిపోయింది. నిమజ్జనం ఉందని తెలిసికూడా అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ఈ పరిస్థితి వచ్చిందని భక్తులు వాపోతున్నారు. మురుగునీరు వస్తుందని తెలియక నీటిలో మునిగామని, ఏమైనా వ్యాధులు వస్తే తమ పరిస్థితి ఏంటని వాపోతున్నారు. ఇంకా వరుసగా వారం పాటు నిమజ్జనాలు ఉన్న పరిస్థితుల్లో సముద్రాన్ని పరిశుభ్రంగా ఉంచేలా ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు.



నల్లటి మురుగునీటిలోనే స్నానమాచరిస్తున్న భక్తులు



సముద్రంలోనికి వస్తున్న మురుగు